ఊపిరి ఆడట్లే!

- కాలుష్యం కోరల్లో బెల్లంపల్లి
- ఇష్టానుసారంగా చెత్తకు నిప్పు
- పట్టణాన్ని కమ్మేస్తున్న పొగ
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



గురిజాలకు వెళ్లే దారి పక్కన చెత్త నుంచి దట్టంగా వెలువడుతున్న పొగ

బెల్లంపల్లి మున్సిపల్ వివరాలు
మున్సిపల్‌వార్డులు 34
మున్సిపల్ జనాభా 56,396
(2011 లెక్కల ప్రకారం)
రోజువారీగా ఏర్పడుతున్న చెత్త 25 మెట్రిక్ టన్నులు
డంప్ యార్డుకు చేరవేస్తున్న చెత్త 20 మెట్రిక్ టన్నులు
రోజువారీగా నిల్వ ఉంటున్న చెత్త 05 మెట్రిక్ టన్నులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీని వాయు, పొగ కాలుష్యం ముంచెత్తుతోంది. రోజురోజుకు కాలుష్యం తీవ్రత పెరిగి పోతుండటంతో స్వచ్ఛమైన గాలి లభించక ఊపిరి తీసుకోవడానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చెత్త చెదారాన్నీ ఇష్టారాజ్యంగా కాల్చడం, కల్తీ పెట్రోల్, డీజిల్ వల్ల వాహనాల నుంచి విషపూరితమైన పొగ వెలువడుతుండగా, మరో పక్క క్షణపాటు తీరిక లేకుండా రేయింబవళ్లు రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న వాహనాల వల్ల దుమ్ము, ధూళీ చెలరేగుతోంది. తద్వారా వాయు కాలుష్యం ప్రబలుతోంది. దీంతో శ్వాసకోశ వ్యాధి గ్రస్తులతో పాటు ఆరోగ్యవంతులు సైతం అనారోగ్యానికి గురి కావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొత్తగా వ్యాధుల బారినపడుతున్నారు. ప్రజారోగ్యాన్నీ ఇంతగా ప్రభావితం చేస్తున్న వాయు కాలుష్యాన్ని నివారించే చర్యలు చేపట్టడంలో మున్సిపల్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

డంప్‌యార్డు చెత్త నుంచి దట్టమైన పొగ...

చెత్త సేకరణలో మున్సిపాలిటీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేనట్లుగా కనిపిస్తోంది. అధికారికంగా డంప్‌యార్డు లేకుండా పోవడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్తను డంప్ చేస్తున్నారు. ప్రస్తుతం పో శమ్మ గడ్డ శివారులో ఉన్న హిందూ శ్మశాన వాటికలో రోజువారీగా సేకరిస్తున్న చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది. ప్రతి రెండు, మూడు రోజులకోసారి గుర్తు తెలియని వ్యక్తులు డంప్‌చేసిన చెత్తకు నిప్పు పెడుతుండటంతో, మసిబారిన దట్టమైన పొగ వెదజల్లుతోంది. ఆ పొగ తీవ్రత సమీపంలో ఉన్న సంక్షేమ బాలుర సీఓఈ గురుకుల పాఠశాల, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, ఇందిరమ్మకాలనీ, కాసిపేట సంక్షేమ బా లుర గురుకుల పాఠశాలలతో పాటు బాలికల వ సతి గృహం, గోల్‌బంగ్లా బస్తీ, బెల్లంపల్లి బస్తీ వ రకు వ్యాపిస్తోంది. బెల్లంపల్లి నుంచి గురిజాల మా ర్గంలో రాకపోకలు సాగిస్తున్న వందలాది మంది వాహనదారులు, గ్రామీణుల ముక్కుపుటలను అదరగొడుతోంది. చీకటి పడటంతోనే చెత్తను కాలబెడుతుండటంతో రాత్రంతా విద్యార్థులు, బస్తీల ప్రజ లు కాలుష్యంతో కూడిన పొగను పీలుస్తున్నారు.

ప్రబలుతున్న శ్వాసకోశ సమస్యలు..

గాలి కలుషితం అవుతుండటంతో శ్వాస కోశ సమస్యలు పెరుగుతున్నాయి. ఓ పక్క డంప్‌యార్డు నుంచి ఉత్పన్నమవుతున్న అత్యంత హానికరమైన పొగ, మరోపక్క దుమ్ము, ధూళితో శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులు మరింత ఇబ్బందికర పరిస్థితులను చవి చూస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న వాయుకాలుష్యాన్ని నివారించడానికి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఎలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఎడ తెగని దుమ్ము, ధూళీ...

బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్ నుంచి బజారు ఏరియా, కాల్‌టెక్స్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా మంచిర్యాల, ఆసిఫాబాద్ వైపు నిత్యకృత్యంగా ఆర్టీసీ బస్సులు ఇతర ప్రైవేట్ వాహనాలు నడుస్తుంటాయి. మున్సిపాలిటీలో రోజువారీగా రోడ్లను శుభ్రం చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగా రోడ్డు మీదుగా వెలుతున్న వాహనం వెనకాల దుమ్ము, ధూళీ చెలరేగుతోంది. ఆ దుమ్ము తీవ్రతకు ఎదురుగా వచ్చే వాహనం కానీ, మనిషి కానీ కనిపించడం లేదు. అంతగా దుమ్ము ప్రబలుతున్నా మున్సిపల్ అధికారులు కనీసం వారానికోసారి కూడా రోడ్డుపై నీళ్ల చల్లించడం లేదు. ఆ దుమ్ము, ధూళిని పీల్చి, మింగి వాహనదారులు, పురప్రజలు అనారోగ్యానికి గురవుతుండగా, రోడ్ల పక్కన పాత టైర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను ఎక్కడ పడితే అక్కడ కాల బెడుతూ వాయు కాలుష్యాన్ని పెంపొందిస్తున్నారు.

నియంత్రణ చర్యలు తీసుకుంటాం



డంప్ యార్డులో ఉన్న చెత్తను కాలబెట్టకుండా పర్యవేక్షణ చేయిస్తున్నాం. కానీ గుర్తు తెలియని వ్యక్తులు సామగ్రి సేకరణకు వచ్చి నిప్పంటిస్తున్నారు. దీంతో చెత్త, ఇతర పరికరాల నుంచి కలుషితమైన పొగ ప్రబలుతోంది. పరిసరప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు, విద్యార్థులు అనివార్యంగా పొగ బారినపడుతున్నారు. రోడ్లపై దుమ్ము, ధూళీ వల్ల కూడా వాయు కాలుష్యం ఏర్పడుతుంది. దీని నివారణకు నీళ్ల చల్లించే ఏర్పాట్లు చేస్తాం. వాయు కాలుష్యం ఏర్పడకుండా నియంత్రణ చర్యలు చిత్తశుద్ధితో చేపడతాం. – కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి

108కు సుస్తీ..!



జైపూర్: అత్యవసర సమయంలో ఆదుకునే 108వాహనం మూలకుపడ్డది. నెల రోజులుగా సేవలు నిలిచిపోయాయి. పాత వాహనం కావడం, తరుచూ అది పాడైపోతుండడంతో దాని స్థానంలో కొత్త వాహనం రావాల్సి ఉంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. విస్తీర్ణంలో పెద్ద మండలం. జైపూర్ మండలంలో 20పంచాయతీలకు కేంద్రంగా జైపూర్ ఆస్పత్రి ద్వారా 108సేవలు నిరంతరం అందించేవారు. మండలానికి ఒక్కపక్కన మంచిర్యాల–చెన్నూర్ 63వ జాతీయ రహదారి, మరో పక్కన హైదరాబాద్ రాజీవ్ రహదారి ఉండగా రెండు ప్రధానమైన రహదారుల్లో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుంటాయి. అలాంటిది ఇప్పుడు ఇక్కడ వాహనమే లేకపోవడం, అత్యవసర సమయంలో వైద్యం అందించేవారే కరువయ్యారు. కనీసం ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి 108వాహనం ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అడ్‌హక్ కమిటీ ఎన్నిక



మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ మంచిర్యాల జిల్లా ఉద్యోగుల అడ్‌హక్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అడ్‌హక్ కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడియారం శ్రీహరి, కార్యదర్శి హబీబ్ హుస్సేన్, డైరక్టర్లుగా ఎస్.మొండయ్య, భూముల రామ్మోహన్, నాగుల గోపాల్, బి.కళావతి, ఏవీఆర్‌డీ.ప్రసాద్‌రావు, సంగర్స్ సంతోష్, ఇంతియాజ్, పుప్పాల హన్మంతరావు, శ్రీపతి బాపురావు, పొన్న మల్లయ్య, ఎల్.గోవింద్ రెడ్డి, తిరుపతిరెడ్డి, జి.హన్మంతరావును ఎన్నుకున్నారు. ఎన్నికలు నిర్వహించే వరకూ కమిటీ కొనసాగుతుందని తెలిపారు.

చెక్కుల పంపిణీ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గానికి చెందిన 155మంది లబ్ధిదారులకు ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తన నివాసంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

20న వెల్‌బేబీ షో

శ్రీరాంపూర్: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 20న వెల్‌బేబీ షో నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నస్పూర్ కాలనీలోని డిస్పెన్సరీలో ఈ కార్యక్రమం జరుగనుందన్నారు. ఉద్యోగుల 5ఏళ్లలోపు పిల్లలకు మాత్రమే ఇందులో పాల్గొనే అవకాశం కలదన్నారు. పోటీల్లో పాల్గొనే పిల్లల ఆధార్‌కార్డు, వారికి వేసిన టీకాల పట్టికతో హాజరు కావాల్సిందిగా కోరారు. మొత్తం 6కేటగిరిల్లో వెల్‌బేబీ ఎంపిక ఉంటుందన్నారు. బేబీ కింగ్, బేబీ క్వీన్, ప్రిన్స్ 1, ప్రిన్స్ 2, ప్రిన్సెస్ 1, ప్రిన్సెస్ 2 ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు.

ఉద్యోగులకు క్రీడా పోటీలు



త్రోబాల్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

శ్రీరాంపూర్: ఈ నెల 23న జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీఎం కార్యాలయంలోని ఉద్యోగులకు, అధికారుల కుటుంబ సభ్యులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఆదివారం సీసీసీలోని ఎస్సీఓఏ క్లబ్‌లో అధికారుల కుటుంబ సభ్యులకు, శనివారం సాయంత్రం జీఎం కార్యాలయం ముందు గల సెంట్రల్ నర్సరీలో జీఎం కార్యాలయం ఉద్యోగులకు వేరువేరుగా ఈ పోటీలు నిర్వహించారు. టగ్‌ఆఫ్‌వార్, త్రోబాల్, వాలీబాల్, బాల్ ఇన్‌బాస్కెట్, బాంబ్ బ్లాస్ట్ వంటి పోటీలు నిర్వహించారు. ఉద్యోగులు, అధికారుల కుటుంబ సభ్యులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు 23న ప్రగతి మైదానంలో జరిగే వేడుకల్లో బహుమతి ప్రదానం చేయనున్నారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జి డీజీఎం(పర్సనల్) రాజేశ్వర్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, సీనియర్ పీవో కాంతారావు, లా అధికారి ప్ర భంధిత, ఇండోర్‌కెప్టెన్ తోట సురేశ్‌లు పాల్గొన్నా రు.

సంతకాల సేకరణలో కార్మికులు పాల్గొనాలి

రామకృష్ణాపూర్: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి కోరారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని, పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్‌ను రద్దు చేయాలని, రిటైర్డ్ కార్మికులకు కంపెనీ క్వార్టర్‌ను పర్మినెంట్‌గా కేటాయించాలనే డిమాండ్లపై సీఐటీయూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణతో పాటు ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. నాయకులు అల్లి రాజేందర్, రామగిరి రామస్వామి, ఐలయ్య, భరత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఐటీయూ బెల్లంపల్లి కన్వీనింగ్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కన్వీనింగ్ కమిటీ సభ్యులు

బెల్లంపల్లి: సీఐటీయూ అనుబంధ సంఘాల బెల్లంపల్లి కన్వీనింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణ, జిల్లా కమిటీ సభ్యుడు రాజారాంల సమక్షంలో కన్వీనింగ్ కమిటీని ఎంపిక చేశారు. కన్వీనింగ్ కమిటీ కన్వీనర్‌గా చల్లూరి దేవదాస్, సభ్యులుగా భానుమతి, అనురాధ, భారతి, పద్మావతి, శంకరమ్మ, సమ్మక్క, రేణుక, రాణి, ఎస్‌కే యాకూబ్, భాగ్యలక్ష్మి, సుమన్, ప్రభాకర్, రవీందర్‌లను ఎంపిక చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

వేమనపల్లి: మండలంలోని నాగారాం గ్రామానికి చెందిన దొంతుల స్వామి, పర్వతాలు, సతీష్, మడె శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముల్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాలి మధు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో సన్నరకం వరి విత్తనాలు

జైపూర్: మండలంలోని రైతులకు జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం ద్వారా 50శాతం సబ్సిడీ పై జేజీఎల్–24423 సర్టిఫైడ్ సన్నగింజ వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి మార్క్‌గ్లాస్టన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం జిరాక్స్ తీసుకొని జైపూర్ రైతువేదిక వద్ద సంప్రదించాలన్నారు. 25కిలోల బస్తా సబ్సిడీ పోనూ రూ.500చెల్లించాల్సి ఉంటుందన్నారు.

గణిత ఒలింపియాడ్ టెస్ట్‌కు స్పందన

మంచిర్యాలఅర్బన్: జాతీయగణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్ఫోర్స్ పాఠశాలల్లో ఆదివారం నిర్వహించిన మ్యాథ్ (గణిత) ఒలంపియాడ్ టెస్ట్‌కు అనూహ్య స్పందన లభించింది. పరీక్షల్లో 1840మంది విద్యార్థులు హాజరై ప్రతిభ చాటారు. అంతకుముందు మంచిర్యాలలో రామనుజన్ చిత్రపటానికి చైర్మన్ నరేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అలరించిన కవి సమ్మేళనం

మంచిర్యాలఅర్బన్: స్థానిక క్రిష్ణవేణి పాఠశాలలో సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకొని కవులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉత్తూరి శ్రీలక్ష్మి, సంతోష్, సత్తయ్య, జగన్‌మోహన్‌రావు, అల్లాడి శ్రీనివాస్ కవితాగానం చేశారు.

బీజేపీ నాయకుల రక్తదానం

మంచిర్యాలటౌన్/చెన్నూర్/మంచిర్యాల రూరల్(హాజీపూర్): బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో మంచిర్యాల పట్టణంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో నాయకులు, అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. హాజీపూర్‌లో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి రఘునాథ్ సంబురాల్లో పాల్గొన్నారు. సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. చెన్నూర్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలుచోట్ల కేకులు కట్ చేసి సంబురాలు జరిపారు.

బోరుతో నీటి కష్టాలు దూరం

బెల్లంపల్లి: కొత్తగా బోరు వేయడం వల్ల నీటి కష్టాలు దూరమవుతాయని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. మున్సిపాలిటీలోని 26వ వార్డు అశోక్‌నగర్ బస్తీలో పాత బోరు కేసింగ్ చెడిపోవడంతో ఆదివారం కొత్తబోరుకు భూమిపూజ చేసి పనులు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ తుంగపల్లి సుజాత, బస్తీ వాసులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మండల పూజ



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



హాజరైన అయ్యప్ప దీక్షాపరులు



చెన్నూర్: పూజలో పాల్గొన్న దీక్షాపరులు

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప మహా మండల పూజ వైభవోపేతంగా సాగింది. అర్చకుడు నరహరిశర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప అభిషేకంతో పాటు పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప స్వాములు గ్రామంలో నగర సంకీర్తన చేశారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు, శ్యాంసుందర్‌రావు పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో కేరళకు చెందిన సంభూద్రి గురుస్వామి నేతృత్వంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహా పడిపూజ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అయ్యప్ప స్వాములు అయ్యప్ప ఉత్సవ విగ్రహాలతో అయ్యప్ప ఆలయం నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శోభాయాత్ర నిర్వహించారు. మహాపడి పూజ అనంతరం అయ్యప్ప స్వాములు అగ్ని గుండ ప్రవేశం చేశారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం వితరణ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవ సమితి అధ్యక్షులు రామయ్య, పద్మనాభాచారి, సురేశ్, తిరుపతి, మోహన్, గురుస్వాములు పాల్గొన్నారు.

పల్లెల్లో బోనాల సందడి



కుశ్నపల్లిలో బోనాలతో మహిళలు



బోనాలు పోస్తున్న మహిళలు

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి మల్లిఖార్జున స్వామి దేవాలయం, నందులపల్లిలోని రావులమల్లన్న ఆలయంలో ఆదివారం షష్టిబోనాలు మల్లన్న దేవుడికి భక్తులు నియమ నిష్టలతో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తకుండలో కొత్త బియ్యం, బెల్లం, పాలతో తయారు చేసిన పాయసాన్ని తీరొక్క కూరగాయలతో వండిన భోజనాన్ని మల్లన్న దేవుడికి నైవేద్యంగా పెట్టి, సహపంక్తి భోజనాలు చేశారు. గడపగడపకూ బంతిపూలు, మామిడి ఆకుల తోరణాలు కట్టి అలంకరణ చేశారు. పిల్లాపాపలతో సల్లంగా ఉండాలని, పంటలు బాగా పండాలని దేవుడిని వేడుకున్నారు. బోనాలు పోసి మొక్కులు చెల్లించుకోవడానికి కోటపల్లి, వేమనపల్లి, కన్నెపల్లి, భీమిని, భీమారం, చెన్నూర్ గ్రామాల నుంచి వా హనాలలో, ఎడ్లబండ్లలో భక్తులు తరలివచ్చారు.

కత్తెరశాలలో బోనాలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరశాల గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు ఆదివారం బోనాలు పోసి, పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో బోనాలు పోసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. కొందరు భక్తులు అన్న సంతార్పణ చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ముల్కలపేట మునలమ్మ బోనాలు

వేమనపల్లి: ముల్కలపేట–రాచర్ల మధ్య ఉన్న ప్రాణహిత నదీ తీరం భక్తజన సంద్రంగా మారింది. నదీ తీరంలోని మునలమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం రాత్రి బోనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. మండలంతో పాటు కోటపల్లి, నెన్నెల, కన్నెపల్లి, భీమిని, పొరుగున ఉన్న మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి బోనాలు పోశారు. గ్రామదేవతలకు కుడక, రైక సమర్పించి కొబ్బరి కాయలు, కోళ్లను బలిచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్వచ్ఛంద కార్మికులకు సన్మానం..

బోనాల జాతరలో అహర్నిశలు కష్టపడిన స్వచ్ఛంద కార్మికులను మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్ ఆలీలు శాలువాలతో సన్మానించారు. నా యకులు ఆవులమద్రి పున్నం, పూర్ణచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లచ్చయ్య, మాజీ స ర్పంచ్ రామచంద్రం, కోడూరి దుర్గయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

సామూహిక వ్రతాలు



వ్రతాలు నోముతున్న భక్తులు

చెన్నూర్: పట్టణంలోని సత్యసాయి మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఏటా మందిరంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని సత్యసాయి సేవ సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వికాస తరంగిణి మహిళా విభాగం కన్వీనర్లు కిరణ్మయి, చకినారపు కృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన పారాయణం

చెన్నూర్: చెన్నూర్ శివాలయంలో గురుచరిత్ర పారాయణం ముగిసింది. వారం రోజుల పాటు నిర్వహించిన గురుచరిత్ర పారాయణం ముగింపు సందర్భంగా దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వేదపండితులు వేమారం మహేశ్వర్‌శర్మ పాల్గొన్నారు.

మహా పుష్పాభిషేకం



మంచిర్యాలఅర్బన్: స్థానిక గడప ఉషాదేవి షిరిడి సాయిబాబా సంస్థాన్ మందిరంలో గురు దత్తాత్రేయ జయంతి బ్రహ్మోత్సవంలో భాగంగా ఆదివారం సాయినాథునికి మహాపుష్పాభిషేకం నిర్వహించారు. బాబాను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

వ్యవ'సాయం'లో చిట్టి చేతులు



వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. కూలీల కొరత కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పత్తి ఏరేందుకు కూలీలు దొరకక రైతులు అవస్థలు పడుతున్నారు. చాలా వరకు రైతులు తమ బంధువులను పిలిపించుకొని ఇంటిల్లిపాదితో కలిసి పత్తి ఏరుతున్నారు. అయితే శనివారం, ఆదివారం సెలవు కావడంతో చిన్నారి విద్యార్థులు వ్యవసాయంలో తల్లిదండ్రులకు సాయంగా నిలుస్తున్నారు. పత్తి ఏరుటలో, పశువులను మేపడంలో నిమజ్ఞమై తమ చిట్టి చేతులతో తల్లిదండ్రులకు సాయంగా నిలుస్తున్నారు. – నెన్నెల